సాంప్రదాయమంటూ
చాదస్తంగా బ్రతికిన
ఆ రాజుకి
కనువిప్పు
ఎలా కలిగింది?

# వదుగురాడు మాట




''ఎవరక్కడ...'' ఆలోచనా మందిరంలో పచార్లు చేస్తూ గర్జించాడు విక్రమవర్మ మహారాజు.

''నేను తప్ప ఎవరూ లేరు మహాప్రభూ'' బయటినుండే ద్వారపాలకుడు వినయంగా సమాధానమిచ్చాడు.

''ఎంత కండకావరము!! ద్వారపాలకా లోనికి రమ్ము'' హుంకరించాడు మహారాజు.

నోట్లోని బీడీ ఆర్పి దుస్తుల్లో దాచుకుంటూ శూలం చేత పట్టుకుని లోపలికి అడుగుపెట్టాడు భటుడు.

''ఏమిరా- దురహంకారీ... పిలువగానే హాజరుకాకుండా పరిహాసములాడుచుంటివా...'' పళ్లు పటపట కొరికాడు మహారాజు.

''లేదండీ మీరు రమ్మనగానే వచ్చానుకదా... ముందు మీరేమన్నారు... ఎవరక్కడ.... అని అడిగారు. నేను తప్ప ఎవరూ లేనందున ఉన్నమాటే చెప్పాను. తప్పా...''

ద్వారపాలకుని మాటలలో రవంత నిర్లక్ష్యం, అతడి నోట్లోంచి వస్తున్న బీడీ పొగను గమనించి మండిపడ్డాడు మహారాజు విక్రమవర్మ.

''నా రాజ్యమునందు ధూమపానము నిషిద్ధమని తెలిసీ మా మందిరమునందే ధూమపానము చేయు సాహసమా... పైగా మాపై నిర్లక్ష్యమా... నీకు మరణదండన విధించవలసియున్ననూ ఉరికంబపు చెక్క పుచ్చిపోయి విరిగియున్నందున దయా హృదయముతో క్షమించుచున్నాను. నిన్ను తక్షణమే ఉద్యోగమునుండి తొలగించడమైనది. నీవు వెళ్లవచ్చు.

''ఇదే ఇంకే దేశంలోనైనా గవర్నమెంట్



ఉద్యోగంలోంచి తీసేయాలంటే ఎంక్వయిరీ, షోకాజు నోటీసులాంటి తతంగమంతా అయ్యాక ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీలాంటి బోలెడు డబ్బిచ్చి 'నిన్ను ఉద్యోగంలోంచి తీసేశాం నాయనా' అని సెండాఫిచ్చి సగౌరవంగా సాగనంపుదురు. మీరు... నీవు వెళ్లవచ్చు అంటూ ఒక్క మాటలో ఉద్యోగం పీకేశారు. ఇలాంటి కొలువులో ఉద్యోగం చేయడంకన్నా పొరుగు

రాజ్యం పోయి పదిమందికి గడ్డం గీసుకు బ్రతకడం మేలు...''

శాలమూ తలపాగ తీసి రాజుగారి ముందు పెడుతూ అన్నాడు భటుడు.

''ప్రపంచమంతా రాకెట్ యుగంలోకి పరుగులు తీస్తుంటే మీరు మాత్రం దేశాన్ని క్రీస్తుపూర్వంలోనే వుంచాలనుకోవడం మంచిది కాదు మహారాజా... ప్రపంచంలోని ఏ ఆధునిక సదుపాయాన్నీ మన రాజ్యంలోకి రానివ్వలేదు మీరు. సంప్రదాయమంటూ రాజ్యాన్ని ఎదగనీయకుండా అధోగతి పట్టిస్తున్నారు. ఇప్పటికే సగంమంది ప్రజలు ఇతర దేశాలకు వలస పోయారు. ఇకనైనా కళ్లు తెరచుకోండి!''

తనను హెచ్చరించినట్లుగా ఆ మాటలు పలికి తన కళ్లముందే దుస్తుల్లో దాచిన బీడీని తీసి వెలిగించుకుని దర్జాగా వెళ్లిపోతున్న ఆ భటుని చూస్తూ నోరు వెళ్లబెట్టాడు మహారాజు.

మహామంత్రి చంద్రశేఖరుడు ప్రవేశిస్తూ ఆ విషయం గమనించాడు. మంత్రి రాకను చూడలేదు మహారాజుగారు.

తన రాకను తెలియజేస్తూ చిన్నగా దగ్గాడు మహామంత్రి. దాంతో తేరుకున్నాడు మహారాజు.

''ఏమి మహామంత్రీ దగ్గుచుంటిరి. అనారోగ్యమా... పడిశం పదిరోగాల పెట్టు అన్నారు పెద్దలు. రవంత కాషాయమున నూర్జుల పత్ర రసమును కలిపి సేవించినచో...''

''అబ్బెబ్బే అదేంకాదు మహారాజా... అనారోగ్యము కాదు...'' ఏం చెప్పాలో తెలియక తడబడ్డాడు మహామంత్రి.

''మహామంత్రీ... మా పరిపాలనయందు దోషమేమైనా యున్నదా... ప్రజారంజకముగానే పాలించుచుంటిమికదా... మరి ఆ భటుడేమి ఏదో వదరుచున్నాడు...''

''వాని పరుష భాషణములను నేనును ఆలకించితిని మహాప్రభూ... తమ పాలనయందు దోషములెంచగలమా... క్షీరమును నీరమును వేరుచేయ సాధ్యమా...'' 'ఒక సాధారణ భటుడు మొహమ్మీద తిట్టినా ఇంకా అర్థంకాలేదా సన్నాసీ' అని మనసులో తిట్టుకుంటూ అన్నాడు చంద్రశేఖరుడు.

అర్థంకాక అయోమయంగా చూశాడు మహారాజు విక్రమవర్మ.

ఇబ్బందిగా కదులుతూ అన్నాడు మహామంత్రి ''క్షమించాలి... తమవలె నైపుణ్యము లేనందున గ్రాంధికమును మాటలాడుట మహాచెడ్డ కష్టముగనున్నది. తమరనుమతించినచో...''

''హు... మంత్రివర్యులకు సైతము రాచభాష గ్రాంధికమువలె గర్జనవలె కష్టతరముగ గన్పట్టుచున్నది... ఏమి చేతుము... అటులనే కానివ్వండి''

''హమ్మయ్య...'' తేలికపడ్డాడు మహామంత్రి. ''మహారాజా... యధారాజా తధా ప్రజా అను రోజులు పోయి 'యధా ప్రజా తధారాజా' అనే ప్రజాస్వామ్యంతో ఈనాడు ప్రపంచముంది. ప్రజల కోరికల మేరకు వారి అవసరాలకు ఆలోచనలకూ అనుగుణంగా పరిపాలించాలి...''

''అనగా ... '' రాజుగారి మొహం కోపంతో ఎరుపెక్కింది.


''కోపగించకండి మహా ప్రభూ! నా మాటల్ని శాంతంగా విని మీరే ఆలోచించండి. ఈనాడు ప్రపంచమంతా ఎంతో అభివృద్ధి సాధించింది. ఎన్నో రకాల ఆధునిక

సదుపాయాలూ, వస్తువులూ ప్రజలకు అందుబాటులో వున్నాయ్. ఒక దేశంలో కనిపెట్టినవాటిని అనుకరించి ప్రపంచంలో అన్ని దేశాలూ వాటిని ఉపయోగిస్తున్నాయ్. విజ్ఞానం ఎంతగా ఎదిగిందంటే మనిషి చంద్రమండలం మీదకూడా కాలుమోపాడు. అటువంటి రాకెట్లూ కంప్యూటర్ల యుగంలో ప్రపంచముంటే మీరింకా ఈ పాత పద్ధతిలోనే ప్రజలందరూ నడవాలనడం సబబు కాదేమో. ఒక్కసారి ఆలోచించండి...!!''

''అనగా దేశ సంస్కృతిని సంప్రదాయాలను మంటగలిపి ఆచార వ్యవహారాలను కాలదన్ని... పనికిమాలిన పాశ్చాత్య సంస్కృతికి దాసోహమనమందురా... కన్న తల్లిని కాదని వెలయాలిని అమ్మా అని పిలిచినట్లు పుట్టిన గడ్డపైని పద్ధతులను త్రోసిరాజని పరాయి సంస్కృతికి ప్రాకులాడమందురా...'' ఆవేశంగా గర్జించాడు మహారాజు.

''మీ ఆవేదన నాకు అర్థమైంది మహారాజా! కానీ మీ తాత ముత్తాతలకు పూర్వులు సైతం ఈవిధముగా ఆలోచిస్తే మనమందరం ఇంకా ఆదిమానవుని స్థాయిలోనే వుండెడివారముకదా! మార్పులకు వారు కాలానుగుణ్యముగా స్పందించుటవలనేకదా నేటి స్థితి సాధ్యమయింది. ఆచారాలూ, సాంప్రదాయాలు మనిషి సుఖజీవనానికి సోపానాలు కావాలి. అంతేకాని ప్రతిబంధకాలు కాకూడదు. ఉదాహరణకు సంప్రదాయి విరుద్ధమంటూ విద్యుచ్ఛక్తిని సైతం దేశంలోకి రానీయలేదు మీరు. అందువలన ప్రజలు ఎన్ని ఇక్కట్ల పాలగుచున్నారో గమనించండి...''

''హు... విద్యుద్దీపములకు అలవాటు పడినవాడు కనీసం భగవంతునివద్దయినా చమురుపోసి వత్తివేసి దీపము వెలిగించునా... అలసత్వముచే అచ్చటకూడా విద్యుద్దీపమునే వెలిగించు సోమరియగును. మనిషి కష్టించి పనిచేయవలెనోగానీ ఉపకరణములపై ఆధారపడు సోమరి కారాదు. ఇక చలనచిత్రములూ, దూరదర్శ యంత్రములూ మానవుని విలువైన



కాలసంపదనూ, సంప్రదాయాలనూ ఎట్లా కాల్చివేయునో నేను చెప్పనవసరంలేదు'' కోర మీసాలు దువ్వుకుంటూ గంభీరంగా అన్నాడు విక్రమవర్మ మహారాజు.

''నీ పిండాకూడు!! ఏడిసినట్టే వుంది నీ మొండితనం. భగవంతుడు నీకు మెదడుని బుర్రలో పెట్టబోయి ఏ మోకాల్లోనో పెట్టుంటాడు తింగరివెధవా... సీక్రెట్‌గా ఏ సద్దాం హుస్సేన్‌కో, జార్జి బుష్‌కో కబురుపెడతానుండు. నాలుగు విమానాలు, రెండు టాంకులూ, పది బాంబులూ పట్టుకు వచ్చాడంటే నీ తిక్క కుదురుతుంది'' మనసులో తిట్టుకుంటూనే మెల్లగా సర్దిచెప్పబోయాడు మహామంత్రి ''అదికాదు మహారాజా'' అంటూ.

ఎప్పుడు ప్రవేశించిందో పట్టపురాణి లీలావతి అంది ''మీరు ఎన్ని చెప్పినా వృధా ప్రయాసే మహామంత్రీ... వారికి మన బాధలు అర్థంకావు. చూడండి ఈ పావుకోళ్లతో పాదాలు ఎలా వాచిపోయాయో''

''ఏమి... మీరిచటకెందులకు వచ్చితిరి'' గద్దించాడు మహారాజు.

''తాడో పేడో తేల్చుకుందామని! ఎన్నాళ్లు మాకీ అరణ్యవాసం... ఓ టీవీ లేదు. సినిమా లేదు. ఆ ముసలి రాజనర్తకి డాన్సులు రోజూ చూడలేక ఛస్తున్నాం.'' రెండవ రాణి శోభాదేవి అందుకుంది.

''అసలు ఈ పూసలూ, జరీబట్టలు, కిరీటాలు రాత్రి పగలు మోయలేక ఛస్తున్నాంకదా... హాయిగా స్లీవ్‌లెస్ షిఫాన్ నైటీ వేసుకుంటే ఎంత హాయిగా వుంటుంది. ఆంగ్లభాష ఆంగ్లభాష అంటూ కనీసం రెండు ఇంగ్లీషుము క్కలు మాట్లాడినా తప్పే! ఈ నూనెదీపాలు, కాగడాలు అబ్బబ్బ పాతరాతియుగంలోకి పట్టుకుపోతున్నారు. దేశానికి రాజుగారట అంటే 'అదేదో చాలా గొప్పనుకుని ఈ పెళ్లికి ఒప్పుకున్నాను. నా ఖర్మ ఇలా కాలుతుంద నుకోలేదు. అనుమానమ్మనిషి... చీకటి పడితేచాలు తనగురించి ప్రజలేమను కుంటున్నారో... అంటూ ముసుగులూ, మారువేషాల్తో ఊరుమీదకు పోయే ఈయన గారికి ఇద్దరు రాణులు చాలక నా బ్రతుకు బండలు చేశారు'' చిన్నరాణి ప్రభావతి ప్రవేశిస్తూనే దులిపేసింది.

''ఏమి ఈ అధిక ప్రసంగము... హద్దులు మీరుచున్నారు''

''మీకు బుద్ధుంటే మేం హద్దులెందుకు దాటుతాం. రాజ్యంలో ఎవర్నీ శుభ్రంగా గడ్డం గీసుకోనివ్వరు. శుభ్రమైన బట్టలు వేసుకో నివ్వరు. ఈ పిచ్చాయన పరిపాలన ఇంకెన్నాళ్లో అంటూ ప్రజలు తిడుతున్న తిట్లు వినలేకున్నాం. ఇంకొన్నాళ్లు ఇలాగే సాగితే ప్రజలు మనల్ని తరిమి కొడతారు. అప్పుడు కోరమీసాలు దువ్వుకుంటూ జారిపోతున్న పంచె ఎగ్గట్టుకుంటూ అడవులకు అడ్డంపడి మీరు పరుగెడుతుంటే హా నాథా... అంటూ మీ వెనుక మేం ముగ్గురమూ కిరీటాలు, పూసల దండలు సర్దుకుంటూ పరుగెడతాం... ఎందుకంటే పతివ్రతలంకదా మరి...'' అక్కసుగా అంది చిన్నరాణి ప్రభావతి.

ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ తల ప్రక్కకి తిప్పుకున్నాడు మహామంత్రి.

''చిన్నారాణీ మీరు అతిగా వాగుచున్నారు సుమా....'' రాణివాసం తిరుగుబాటును సహించలేని మహారాజు ఏం చేయాలో తోచక

కోపంగా గర్జించాడు.

''లేదు ప్రభూ... ఆమె చెప్పినది నిజమే. మీరు వాస్తవాన్ని గ్రహించండి. ఆధునికతను అంగీకరింపక మీరిలా తుప్పుపట్టిన శూలాలనూ, వంగిపోయిన బాణాలనూ, మొండి ఖడ్గాలనూ నమ్ముకు కూర్చుంటే... ఏ ఇతర దేశస్థులైనా దండెత్తితే క్షణాలలో మన రాజ్యాన్ని స్వాధీనం చేసుకుంటారు. అప్పుడు ప్రజలకు వైరి వర్గానికే వత్తాసు పలుకుతారు. కనీసం పారిపోయి ప్రాణాలు రక్షించుకునేందు మనదగ్గర కార్లూ, విమానాలు ఏమీ లేవుకదా... తీరిగ్గా మనం అంబారీ ఏనుగుల్నీ, గుర్రబ్బగ్గీలనూ కదిలించేంతలో శత్రువులకు చిక్కిపోతాం. అప్పుడు మనం ఆ దేశపు జైళ్లలో ఫోర్ట్వంటీలుగా కాలక్షేపం చేయాల్సి వస్తుంది'' పెద్దరాణీ, రెండోరాణీ అన్నారు.

''కానీ మన పూర్వ సంస్కృతీ సంప్రదాయాలు'' నసిగాడు మహారాజు.

''నా శ్రాద్ధం. మనకు బ్రతుకే లేకపోతే ఇక సంస్కృతీ సంప్రదాయం వుండి ఎవర్ని ఉద్ధరిస్తాయి!'' చిన్నరాణి విసురుగా అంది.

మహామంత్రి చంద్రశేఖరుడు ఇదే సరైన అదనుగా భావించి మెల్లగా నచ్చజెప్పసాగాడు... ''మహారాజా... పదుగురాడుమాట పాడియై ధరజెల్లు. ఒక్కడాడుమాట యెక్కదెందు'' అని శతకకారుడు ఎప్పుడో చెప్పాడు. దాని అర్థమే ఇప్పుడు విక్టరీ ఫర్ మెజారిటీ అనేది. అన్ని దేశాలలోలాగే మనమూ ఆధునిక హంగులన్నీ సమకూర్చుకుని ఆ దేశాలవలె మనంకూడా రాచరికపు సంప్రదాయాల్ని అవసరమైనమేరకు పాటిద్దాం. అంతేకాని ప్రజల తిరస్కారానికి గురయితే మనకు మనుగడ వుండదు.''

ఇన్నాళ్లూ ప్రజల తిరస్కారం చూచాయగా తెలిసినా ఇంత ప్రత్యక్షంగా తెలియలేదు మహారాజు విక్రమవర్మకి. రాణివాసమే చీదరించుకుంటుంటే ఇక మారక తప్పదనిపించింది.

''మీరు మారకపోతే మేం విడాకు లిచ్చేస్తాం.... ఆపై మీ ఇష్టం'' ముగ్గురు మహారాణులు ఒక్కసారిగా చెప్పారు.

''మీ ఇష్టం మహామంత్రీ... ప్రజలకు ఏమి కావలెనన్న మనము ఆ విధముగానే పరిపాలిద్దాం'' మహారాజు చివరికి అంగీకరించాడు.

మహారాజు మాటలతో ఉబ్బి తబ్బిబ్బయ్యాడు మహామంత్రి చంద్రశేఖరుడు. ''మహా సంతోషం ప్రభూ... ఇప్పుడే ఈ విషయాన్ని ప్రజలకు చాటింపు వేస్తాను. ఇక టెండర్లూ అవీ పిల్చి కరెంట్ సబ్స్టేషన్లు, టీవీ స్టేషన్లు, కార్లు బస్సులు, ఫ్యాక్టరీలు... ఓహ్! మన రాజ్యాన్ని త్వరలోనే అమెరికాకు ధీటుగా తయారుచేద్దాం. దీసీజ వెరీ హేపీ డే... వుయ్ హావ్ టు సెలెబ్రేట్ అవర్ ఇండిపెండెన్స్... రియల్లీ...''

''అది సరేగానీ మహామంత్రీ... మీరు ఆంగ్లభాష... అదే ఇంగ్లీషు... ఎలా నేర్చుకున్నారు... నిషేధము విధించితినిగదా...''

''పక్క దేశమునుండి కరెస్పాండెన్స్‌ద్వారా బి.ఏ పాసయ్యాను యువర్ మెజెస్టీ....''

''ఆ!!!'' నోరు తెరిచాడు విక్రమవర్మ మహారాజు.

● ● ●